సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ తనిఖీ

హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: హుస్నాబాద్ మండలంలోని జిల్లెలగడ్డలో గల సోషల్ వెల్ఫేర్ రెసి డెన్షియల్ స్కూల్ (బాయ్స్)ను జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేశాలమేరకు గురువారం రోజున హుస్నాబాద్ మం డల ప్రజాపరిషత్ అధికారి (ఎంపీడీఓ) అకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థుల వసతి, భోజనం, శుభ్రత, తరగతుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్‌కు పలు సూచనలు జారీ చేసి, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా పాఠశాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపివో మోహన్‌నాయక్‌తో పాటు తదితరులు ఉన్నారు.

వంటశాలను పరిశీలిస్తున్న ఎంపిడివొ రమేష్

ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి: జిల్లా కలెక్టరేట్ ఆవరణలో గల ఇవిఎం గోదాంను జిల్లా కలెక్టర్ కె.హైమావతి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నెలవారీ పరిశీలనలో భాగంగా గోదాం చుట్టూ కలియతిరిగారు. లాగ్ బుక్ చెక్ చేసి విజిటర్స్ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియి మార్గదర్శకాల ప్రకారం చుట్టు సిసి కెమెరాల పనితీరు, పోలీసు అధికారుల 24/7 గట్టి బందోబస్తు నిర్వహించాలని ఆదేశించారు. ఈవీఎం గోదాం పరిసర ప్రాంతాన్ని పర్యవేక్షణ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

ఈవీఎం గోదాంను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

ఇసుక వేలం నిర్వహిస్తున్న అధికారులు.

ఇసుక వేలం పాట..

చిలిపిచెడ్, ఎప్రిల్ 9 ప్రభాతవార్త ; చిలిపిచెడ్ మండలంలోని మంజీరా పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని తహసిల్దార్ సహదేవ్, ఎస్సై నర్సింలు అన్నారు. గురువారం రెవెన్యూ కార్యాలయ ఆవరణలో గత వారం మంజీరా పరివాహక ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్ల ఇసుకను స్వాధీనం చేసుకుని వేలం నిర్వహించారు. వేలం పాటలో రూ. 5500వేల రూపాయలు వచ్చాయని తహసిల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెవెన్యూ పోలీసు శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గ్రామ శివారులో గస్తీ ఏర్పాటు చేశామని అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లు దొరికితే కఠిన చర్యలు ఉంటాయని వారు అన్నారు. రెవెన్యూ, పోలీస్ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవు..

చిలిపిచెడ్, ఎప్రిల్ 9 ప్రభాతవార్త : రేషన్ డీలర్లు మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆర్ఐ సునీల్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన చిలపిచెడ్‌లో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల రేషన్ డీలర్లతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ బియ్యం పంపిణీ తూకం వేసేపుడు ఎలాంటి మోసాలు చేసిన చర్యలు తప్పవని ఆర్ఐ సునీల్ చౌహన్ హెచ్చరించారు. సమయానుకూలంగా రేషన్ బియ్యాన్ని సరఫరా చేయాలని, ఎండలు ఎక్కువగా ఉండటం వల్ల సాయంత్రం సమయాన్ని పెంచి లబ్ధిదారులకు సహకరించాలని అన్నారు. రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లతో మాట్లాడుతున్న ఆర్ఐ సునీల్.

శ్రీసీతారామ ఉమామహేశ్వరులను దర్శించుకున్న సిఐ

గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 9 (ప్రభాతవార్త): గజ్వేల్ పట్టణంలోని శ్రీసీతారామ ఉమామహేశ్వరాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం గజ్వేల్ సిఐ రవికుమార్ స్థానిక ఎస్ఐతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సీతారామచంద్రస్వామి, ఉమాహేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు సిఐ రవికుమార్‌తో పాటు ఎస్ఐని శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఉమామహేశ్వరస్వామిని దర్శించుకుంటున్న గజ్వేల్ సిఐ రవికుమార్

పాలకుల కార్మిక వ్యతిరేక విధానాలను త్రిప్పి కొట్టగలం

పటాన్ చెరు:ఏప్రిల్ 9ప్రభాత వార్త : పాలకుల కార్మిక వ్యతిరేక విధానాలను కార్మికవర్గ ఐక్యత ద్వారానే త్రిప్పి కొట్టగలమని శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ 42వ వ్యస్థాపక దినోత్సవ సభలో చుక్కా రాములు పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు పారిశ్రామిక ప్రాంతంలోని శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ 42వ వ్యవస్థాపక దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూనియన్ అధ్యక్షులు, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు పాల్గొని సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన యూనియన్ వ్యవస్థాపక దినోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ.. 1985 ఏప్రిల్ 9న సీఐటీయూ కి అనుబంధంగా స్థాపించిన శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ (అప్పటి విడియా ఎంప్లాయిస్ యూనియన్) కార్మికులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ ఎన్ని యాజమాన్యాలు మారినప్పటికీ కార్మిక సంక్షేమంలో రాజీలేకుండా 41 సం.లుగా యూనియన్ ను ఒకే నాయకత్వంలో నిలబెట్టుకోవడం అనితర సాధ్యమైందన్నారు. ఇంతటి ఘనమైన విజయాలకు సహకరించిన కార్మికులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం కార్మికవర్గానికి వ్యతిరేకంగా తెచ్చిన లేబర్ కోడ్స్ వల్ల పర్మినెంట్ ఉద్యోగుల స్థానంలో స్టయిఫండ్ ఇచ్చి పని చేయించుకునే పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో యువ కార్మికులు, యువ నాయకత్వాన్ని అభివృద్ధి చేసుకోవలసిన అవసరమునదని చెప్పారు. అనంతరం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ నెల 8, 9, 10 తేదీలలో తలపెట్టిన సామాజిక ఉద్యమ సంఘీభావ పిలుపులో భాగంగా ఆయన స్వయంగా కార్మికుల నుండి విరాళాలలు సేకరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.పాండురంగా రెడ్డి, ఎం.మనోహర్, ఎ.వీరారావు, హెచ్.వెంకట్రావు, వి.సదాశివ రెడ్డి, ఎం. సత్తిబాబు, కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చుక్క రాములు

ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో అప్పుల పాలై
అదృశ్యమైన యువకుడు

నర్సాపూర్ ఎప్రెల్9, ప్రభాతవార్త : ఆన్‌లైన్ లో బెట్టింగులు వేసి అప్పుల పాలై ఇంట్లో నుండి ఓ యువకుడు పారిపోయి అదృశ్యమైన సంఘటన నర్సాపూర్ పట్టణంలో చోటు చేసుకుంది.

ఎస్సై రంజిత్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం నర్సాపూర్ పట్టణానికి చెందిన తెరుదెల్లి చరణ్(23) మొబైల్ షాప్ లో పనిచేస్తూ జీవిస్తున్నాడు. గత కొన్ని రోజుల నుండి చరణ్ తన మొబైల్ ఫోన్లో ఆన్లైన్ బెట్టింగులు ఆడుతున్నాడు. ఈ బెట్టింగుల్లో నష్టపోయి చరణ్ అప్పుల పాలయ్యాడు. ఈనెల 1వ తేదీన ఇంట్లో భోజనం చేసి మొబైల్ షాప్ కు వెళ్తున్నానని బయటకి వెళ్లడం జరిగింది. బయటికి వెళ్లిన చరణ్ రాత్రి అయిన ఇంటికి తిరిగి రాలేదు. చరణ్ గురించి స్నేహితుల వద్ద, బంధువుల వద్ద వెతికిన ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. చరణ్ ఇంట్లో నుండి వెళ్లేటప్పుడు బ్లూ కలర్ షర్ట్, బ్లాక్ కలర్ పాయింట్ ధరించి ఉన్నాడు. తన కొడుకు ఆచూకీ తెలుసుకొని అప్పగించాలని చరణ్ తండ్రి నాగభూషణం నర్సాపూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంజిత్ కుమార్ వెల్లడించాడు.

సారాకు కేరాఫ్‌గా మల్చేరు తండా..

మహిళల ఆర్తనాదాలు ...!

అక్కన్నపేట, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : అక్కన్నపేట మండలం మల్చేరు తండా గుడుంబా (సారా)కు అడ్డాగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తండాలో అక్రమంగా గుడుంబా తయారీ, విక్రయాలు రోజురోజుకు పెరుగుతున్నాయని వాపోతున్నారు. ప్రత్యే కంగా సాయంత్రం వేళల్లో చుట్టు పక్కల గ్రామాల నుండి కూడా మందు బాబులు తండాకు చేరుకుని గుడుంబా సేవిస్తున్నారని, ఒక్క లీటర్ గుడుంబాను రూ.200కు విక్రయిస్తున్నారని స్థానికుల సమాచారం మేరకు తెలుస్తోంది. గుడుంబా సేవించిన పురుషులు ఇంటికి వెళ్లి వాళ్ళ భార్యలను వేధిస్తూ, కొట్టే ఘటనలు తరచూ జరుగుతున్నాయని మహిళలు వాపోతున్నారు. ఇతర జిల్లాల నుండి బెల్లం, స్పటికను రాత్రి వేళల్లో రహస్యంగా తరలించి గుడుంబా తయారు చేస్తున్నారని గ్రామ స్తులు బాహాటంగానే మాట్లాడుకుంటున్నారు. ఈ అక్రమ కార్యకలాపాలు

బహిరంగంగానే జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని మహిళలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి మల్చేరు తండాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, గుడుంబా తయారీ, విక్రయాలను పూర్తిగా అరికట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని వారు హెచ్చరిస్తున్నారు.

ముప్పైకి పైగా కేసులు నమోదు చేశాం..

మల్చేరుతండా గ్రామంలో గుడుంబా విక్రయాలపై ఎక్సైజ్ ఎస్ఐ దామోదర్‌ను ప్రభాతవార్త వివరణ కోరగా తమకు వచ్చిన సమాచారం మేరకు అదే గ్రామంలో ఇప్పటికే ముప్పైకి పైగా కేసులు నమోదు చేయడంతో పాటు అందరికి కౌన్సిలింగ్ సైతం ఇచ్చామన్నారు. గుడుంబా విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ప్రస్తుతం తమశాఖలోని కానిస్టేబుల్‌ల బదిలీల కారణంగా కాస్త బిజీగా ఉన్నామని గుడుంబా విక్రయించినా, తయారు చేసేవారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు.

-కొండపోచమ్మ ప్రాజెక్టు ద్వారా నీటి విడుదల
-మాజీ డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి

రైతులకు వరంలా మారిన కాళేశ్వరం ప్రాజెక్టు

ములుగు, ఏప్రిల్ 9 (ప్రభాతవార్త): బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు తెలంగాణ రాష్ట్రంలో బీడువారిన భూములను సస్యశ్యామలం చేయడానికి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ఈ ప్రాంత రైతులకు వరంలా మారిందని మాజీ డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి పేర్కొన్నారు.

ములుగు మండల పరిధిలోని కొట్యాల, అల్లీనగర్, అడవిమజీద్, నర్సంపల్లి, క్షీరసాగర్, జప్తిసింగాయిపల్లి గ్రామాల రైతులు తమ పంటపొలాలకు నీటిని విడుదల చేయాలని మాజీ డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డికి తెలుపగా మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ దృష్టికి తీసుకెళ్ళారు. వెంటనే స్పందించిన కెసిఆర్ గురువారం సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించగా ఇరిగేషన్ శాఖ ఈఈ శ్రీనివాస్, డిఈ అంజలితో పాటు ఏఈ వెంటనే కొండపోచమ్మ సాగర్ నుండి కెనాల్ ద్వారా నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా బట్టు అంజిరెడ్డి మాట్లాడుతూ అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగం లేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలోని అన్ని చెరువులు, కుంటలు నీటితో కళకళలాడుతున్నాయని తెలిపారు. మండుటెండల్లో సైతం రైతుల పంటపొలాలకు నీరు అందుతుంది అంటే బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రాజెక్టుల వల్లే అని పేర్కొన్నారు. కొండపోచమ్మ ప్రాజెక్టు ద్వారా కెనాల్‌లోకి నీటిని విడుదల చేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

కెనాల్ ద్వారా ప్రవహిస్తున్న నీటిని పరిశీలిస్తున్న బట్టు అంజిరెడ్డి, అధికారులు

భూములు ఇచ్చిన ప్రతి రైతుకు 100 గజాల ఇళ్ల స్థలం కేటాయించాలి
: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

గుమ్మడిదల రైతులకు న్యాయం చేయాలి

గుమ్మడిదల, ఏప్రిల్ 9: ప్రభాతవార్త : గుమ్మడిదల మున్సిపల్ పరిధిలో పరిశ్రమల స్థాపన కోసం భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి రైతుకు 100 గజాల ఇళ్ల స్థలం కేటాయించాలని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ కూడా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ..

భూములు ఇచ్చిన రైతులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి,జిల్లా కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే .గుమ్మడిదల రైతులకు న్యాయం చేయాలి ప్రతి రైతుకు 100 గజాల ఇళ్ల స్థలం ఇవ్వాలని డిమాండ్.రైతులకు ఇచ్చిన హామీ వెంటనే అమలు చేయాలి.పరిశ్రమల కోసం భూములు ఇచ్చిన రైతులకు 100 గజాల ఇళ్ల స్థలం ప్లాట్లు ఇవ్వాలి:సంగారెడ్డి కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే జీఎంఆర్.గుమ్మడిదల రైతుల సమస్యపై ఎమ్మెల్యే జీఎంఆర్ ఆవేదన వినతి.

హామీ నిలబెట్టాలి - రైతులకు ప్లాట్లు ఇవ్వాలి
కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి,

గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని సర్వే నెంబర్ 109లో

జిల్లా కలెక్టర్ ప్రావిణ్యకు వినతి పత్రం అందిస్తున్న పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మైపాల్ రెడ్డి, గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు

సుమారు 160 ఎకరాల భూమిని పారిశ్రామిక మౌలిక సదుపాయాల కోసం సేకరించిన సమయంలో రైతులకు తగిన నష్టపరిహారంతో పాటు ప్రతి రైతుకు 100 గజాల నివాస స్థలం కేటాయిస్తామని అప్పటి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సమక్షంలో హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే హామీ ఇచ్చి సంవత్సరం గడిచినా ఇప్పటివరకు ప్లాట్ల కేటాయింపు జరగకపోవడం పట్ల రైతుల్లో అసంతృప్తి నెలకొన్నట్లు తెలిపారు.

ప్లాట్ల కేటాయింపుకు ఐదు ఎకరాల భూమిని గుర్తించినట్లు రైతులు తమ దృష్టికి తీసుకువచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అయితే ఆ స్థలాన్ని కూడా పరిశ్రమలకు కేటాయించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే సమాచారం రావడం ఆందోళన కలిగిస్తోందన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేయాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

రైతుల సమస్యను జిల్లా యంత్రాంగం అత్యంత ప్రాధాన్యంతో తీసుకొని వెంటనే ప్లాట్ల కేటాయింపును పూర్తి చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. సమస్యపై సంబంధిత అధికారులతో చర్చించి బాధిత రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నాయకులు యాదగిరి యాదవ్, వెంకట్రామ్ రెడ్డి, హుస్సేన్ తదితరులు, బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల స్థలం కబ్జాకు యత్నం

- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ తీరుపై తీవ్ర అసంతృప్తి
- మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ డిమాండ్

పటాన్ చెరు,ఏప్రిల్ 9,ప్రభాత వార్త: పటాన్ చెరు పట్టణం నడిబొడ్డున ఉన్న జిల్లా పరిషత్ హై స్కూల్ స్థలం కబ్జాచేసేందుకు యత్నిస్తున్నారని, ఇందులో భాగంగానే పాఠశాల భవనాన్ని రాత్రికి రాత్రి కూల్చి వేశారని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు ఆరోపించారు. ఈ విషయంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ తీరుపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. గురువారం పటాన్ చెరు పట్టణం శ్రీ నగర్ కాలనీలో మంగళవారం రాత్రి కూల్చి వేసిన పాఠశాల భవనాన్ని బీజేపీ నాయకులతో కలిసి ఎంపీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తాను ఫోన్ చేసి కలెక్టర్ కు, డీసీపీ కి ఫిర్యాదు చేసేవరకు కూల్చివేతలు కొనసాగాయని తెలిపారు. జాతీయ రహదారి విస్తరణకు పాఠశాల అడ్డుగా లేకున్నా ఎందుకు కూల్చివేశారు, ఎవరు కూల్చారు, ఎవరి ఆదేశాలతో కూల్చారో సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల ప్రహరికి ముందు ఉన్న దుకాణాలు తొలగించకుండా ప్రహరీ నుంచి పది అడుగుల దూరంలో ఉన్న భవనాన్ని రాత్రికి రాత్రి ఎందుకు కూలచాల్సి వచ్చిందని ప్రశ్నించారు. 1962 కు పూర్వం నుంచే అక్కడ పాఠశాల ఉందని, భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన ప్రొసీడింగ్స్ చూపిస్తూ, సర్వే

రిపోర్ట్ లను సైతం ఆయన ప్రదర్శించారు. స్థానికంగా ఉన్న కొందరు ఆ భూమిపై వివాదం సృష్టించి కింది కోర్టు నుంచి సుప్రీం కోర్ట్ వరకు అన్నికోర్టుల్లోనూ ఓడిపోయారని గుర్తు చేశారు. పాఠశాల స్థలాన్ని కాపాడాల్సిన అధికారులు కబ్జాదారులకు అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ స్పందన పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అధికారులను పంపి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సింది పోయి ఉదాసీనంగా వ్యవహరించారని ఆరోపించారు .ఇప్పటికైనా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో స్థానికులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. జాతీయ రహదారి విస్తరణకు, పాఠశాల కూల్చివేతకు ఎలాంటి సంబంధం లేదని ఎంపీ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిన్నారం మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు 'ఉద్యోగ మిత్ర' ద్వారా ఉపాధి అవకాశాలు
-గజ్వేల్ సిఐ రవికుమార్

గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 9 (ప్రభాతవార్త): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో సిద్దిపేట పోలీస్ విభాగం ఆధ్వర్యంలో సిద్దిపేట పోలీస్ ఉద్యోగ మిత్ర కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని గజ్వేల్ సిఐ రవికుమార్ తెలిపారు. గురువారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్మన్ కళ్యాణ్‌కార్ పద్మాబాయి నర్సింగరావు, కౌన్సిలర్లతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రవికుమార్ మాట్లాడుతూ సుమారు 100కు పైగా ప్రముఖ కంపెనీలలో 1500 కంటే ఎక్కువ ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయని, అర్హత కలిగిన నిరుద్యోగ యువతకు సరైన ఉపాధి మార్గాలను చూపి, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలని, ప్రతి వార్డులోని కౌన్సిలర్లు తమ పరిధిలోని నిరుద్యోగులకు ఈ సమాచారాన్ని చేరవేసి, వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని కోరారు. అలాగే పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ మరియు నేరాల నియంత్రణ కోసం సిద్దిపేట సురక్ష నేత్ర కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. ఒక్కో సిసి కెమెరా వంద మంది పోలీసులతో సమానమని తెలిపారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, కాలనీలు, వ్యాపార సముదాయాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసేలా కౌన్సిలర్లు చొరవ చూపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

72 గంటల్లో దోపిడి కేసును ఛేదించిన పోలీసులు

సిద్దిపేట,ప్రభాతవార్త ప్రతినిధి: సిద్దిపేటలో సంచలనం సృష్టించిన డాక్టర్ ఇంట్లో దోపిడి కేసును పోలీసులు ఛేదించారు. 9 మంది నిందితుల అరెస్టు చేసి రూ.20 లక్షల విలువైన ఆస్తి రికవరీ చేశారు. గురువారం సీపీ సాధన రష్మీ పెరుమాళ్ విలేకరులకు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని బూర్గుపల్లి చెర్వితా మెడోస్‌లో గత నెల 4న డాక్టర్ ఇంట్లో జరిగిన దోపిడి కేసును పోలీసులు 72 గంటల్లో ఛేదించారని సీపీ తెలిపారు. డాక్టర్ ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులో చొరబడి ఇంట్లో వారిని కత్తులతో బెదిరించి తాళ్లతో కట్టివేసి నగదు,బంగారు అభరాణాలతో పారిపోయారని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను బాధితుల ఇంటి వద్దనే ఫిర్యాదు స్వీకరించి అక్కడే ఎఫ్ఆర్ఐ కాఫీని అందజేసి గాలింపు చేపట్టినట్లు వివరించారు. దోపిడికి మాస్టర్ మైండ్ బెల్లంపల్లికి చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి నరేంద్రుల శ్రీకాంత్ అలియాస్ క్రాంతి రామగుండం ఎల్ఓసిలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తూ విలాసవంతమైన జీవితానికి అలవాటు పడిసులభంగా డబ్బు సంపాదించాలని ప్లాన్ వేసినట్లు తెలిపారు.

తన స్నేహితులైన రాజేష్, శ్యామ్, చంద్రశేఖర్‌లతో కలిసి దోపిడికి ప్లాన్ వేసినట్లు పేర్కొన్నారు. ములుగు,భద్రాచలం ప్రాంతాల్లో నేర చరిత్ర

వివరాలను వెల్లడిస్తున్న సిపి సాధన రష్మీ పెరుమాళ్

కలిగిన గణేష్, ప్రేమ్‌చంద్, పవన్‌లను గ్యాంగ్‌లో చేర్చుకున్నట్లు వివరించారు.గత నెల 4న నిందితులు రెక్కి నిర్వహించి రాత్రి 8 గంటలకు డాక్టర్ ఇంటి ప్రహరి గోడ దూకి లోపలికి ప్రవేశించినట్లు తెలిపారు. ఇద్దరు మహిళలు,ఇద్దరు పిల్లలను కత్తులతో బెదిరించి 8,6 తులాల బంగారం, రూ.1లక్ష నగదు, సెల్‌ఫోన్లు దోచుకెళ్లినట్లు వివరించారు. నిందితులు నరేంద్రుల శ్రీకాంత్ అలియాస్ క్రాంతి(41), ములుగుకు చెందిన కల్లూరి గణేష్(30), ముత్యబోయిన ప్రేమ్‌చంద్(21), బడిశె పవన్(23) గోదావరిఖనికి చెందిన సింగరేణి ఉద్యోగి దుగుట చంద్రశేఖర్(44), గోదారిఖనికి చెందిన డ్రైవర్ మడిశెట్టి రాజేష్(39), అక్కపాక శ్యామ్(39), లాడె ప్రకాష్(26), భద్రాచలంకు చెందిన పెయింటర్ మాచర్ల వినయ్(20)లను అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి 4.3 తులాల బంగారు అభరణాలు, బ్లూ యమహా ఆర్15 బైక్, మారుతి డిజైర్ కార్(టిజి09టి5140) 10 ఫోన్లు, రూ.50 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసును చేధించడంలో సమన్వయంతో పని చేసిన ఎసిపి రవీందర్‌రెడ్డి, సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, సీసీఎస్ సీఐ రవీందర్, ఎస్ఐలు తిరుపతి, రాజేష్, చంద్రమోహన్, వివేక్,సౌజన్య,శరత్(ఫింగర్ ప్రింట్ టీం) ఇరత సిబ్బంది రాజు,సుభాష్, యాదగిరి, స్వామి, ఐటి సెల్ బృందం రమేష్, శ్రీకాంత్‌ను సీపీ అభినందించారు.

చలివేంద్రంలో తాగు నీటిని పంపిణీ చేస్తున్న దృశ్యం

కళాబంధు రమేష్ సేవలు అభినందనీయం

షాద్‌నగర్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : పట్టణంలోని పోలీస్ స్టేషన్ ముందు కళాబంధు బండారి రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలి వేంద్రం, అంబలి కేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పెంటయ్య, ముబారక్ ఆలీ పాల్గొన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహాన్ని తీర్చే లక్ష్యంతో గత 20 ఏళ్లుగా నిరంతరంగా చలివేంద్రాలు నిర్వహిస్తూ వస్తున్న రమేష్ అభినందనీయులని మున్సిపల్ చైర్మన్ కొనియాడారు. కార్యక్రమంలో గుర్రం రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పరందాములు, విద్యాసాగర్ రెడ్డి, శేఖర్, లయన్ కమ్మదనం సుధాకర్, నాగిళ్ళ గోపాల్ గుప్తా, డిస్కో సీను, మురళి, లింగమయ్య, పానుగంటి శశిధర్, రఘురామ చారి, గడ్డం వెంకటేష్, యంసాని శ్రీనివాస్, దుగ్గు శేఖర్, భద్రప్ప, గడ్డం కిషోర్, డా.రాచయ్య, సత్యనారాయణ సింగ్, మనోహర్ రాజ్, పాల్గొన్నారు.

హరీష్ రావుకు ఘన స్వాగతం

షాద్‌నగర్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : గొల్లపల్లి చీర్క పల్లి రిజర్వాయర్ నిర్మాణానికి వ్యతిరేకంగా బహిరంగ సభలో పాల్గొనేందుకు వనపర్తి జిల్లాకు బయలుదేరిన మాజీ మంత్రి హరీష్ రావుకు బైపాస్‌లో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, బీఆర్ఎస్ శ్రేణులు స్వాగతం పలికారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

భూమి పూజ చేస్తున్న సర్పంచ్

షాద్‌నగర్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : రాష్ట్రంలోని పేదలందరికీ సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్జర్ల సర్పంచ్ ఆర్. బాబునాయక్ తెలిపారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెల్ జర్లలో సక్కమ్మ ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం

షాద్‌నగర్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : ఫరూఖ్ నగర్ మండలం మొండోని రాయి తండా గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్రీ హనుమాన్ దేవాలయానికి మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ రూ.50 వేల విరాళాన్ని అందజేశారు. గ్రామ ప్రజల విజ్ఞప్తికి ఆయన సానుకూలంగా స్పందించారు. ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధి సమాజంలో సానుకూల మార్పులకు దోహదపడుతుందన్నారు. దేవాలయం నిర్మాణం త్వరితగతిన పూర్తి కావాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజల ఐక్యతకు ఇది ఒక ప్రతీకగా నిల వాలన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, యువకులు అంజయ్య యాదవ్ సేవలను కొనియాడుతూ కృతజ్ఞతలు తెలిపారు. దేవాలయ నిర్మాణానికి ఆయన అందించిన సహాయం గ్రామ అభివృద్ధికి దోహద పడుతుందని అభిప్రాయపడ్డారు.

యువత రాజకీయాలలో కీలకంగా మారాలి

ఆమనగల్లు, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: యువత రాజకీయాలలోకి వచ్చి ప్రజాసేవలందించాలని టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్ కోరారు. పాత సమస్యలకు కొత్త పరిష్కారాలతో వారు ఆలోచించగలరన్నారు. ఆమనగల్లు పట్టణంలోని రాజీవ్ చౌరస్తాలో గురువారం ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్య దర్శి ఫరీద్ అధ్యక్షతన ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మున్సిపాలిటీ చైర్మన్ పత్యనాయక్, కాంగ్రెస్ యువజన నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు. తొలుత ఎన్ఎస్ యూఐ జెండా ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్, చైర్మన్ పత్యనాయక్ మాట్లాడుతూ దేశ నిర్మాణంలో యువతదే కీలక పాత్రన్నారు. రాజకీయాలలోకి రావడం వల్ల టెక్నాలజీ, విద్య, ఉద్యో గాలు, పర్యావరణం మీద స్పష్టతతో సమాజానికీ ఎంతో మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జగన్, కడ్తాల మండల అధ్యక్షుడు బిచ్యనాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీశైలం, ఆదివాసీ రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్, అలీం, కండె సాయి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిపిసిసి సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

120 మందికి ఆరోగ్య పరీక్షలు

ఆమనగల్లు, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి ఆరోగ్య పరీక్షలు పొందారు. ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా వైద్యశాఖ ఈప్రత్యేక కార్యక్రమం నిర్వహిం చారు. వార్డులోని కోట మైసమ్మ దేవాలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని స్థానిక కౌన్సిలర్ నాగిళ్ళ జగన్, 5వవార్డు కౌన్సి లర్ పాపిశెట్టి రాము సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య బృందం మెడికల్ ఆఫీసర్ మహిమునిబేగం ఆధ్వర్యంలో 120 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. వ్యాధుల పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించకుండా విధిగా వైద్యులను సంప్రదించి వారి సలహాలు, సూచనలతో ఆరోగ్యవంతంగా జీవించాలని కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది ఎంపిహెచ్ఓ తిరుపతిరెడ్డి, తాళ్ళ రఘు ఉన్నారు.

కుల్కచర్ల పోలీసులకు నగదు రివార్డులు

కుల్కచర్ల, ఏప్రిల్, 9 ప్రభాతవార్త : బండవెల్కిచర్ల మహిళ హత్య కేసును మూడు రోజులలో ఛేదించిన కుల్కచర్ల పోలీసులకు డిఎస్‌పి శ్రీనివాస్ నగదు రివార్డు అందజేశారు. బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన కొత్తబాయి వెంకటమ్మ (63)ను పక్కింటి కుర్వ మంజుల, ఆమె భర్త భీరయ్య, అరుణ్‌తో కలిసి ఆభరణాల కోసం హత్య చేసిన సంగతి తెలిసిందే.

ఈ కేసులో నిందితులకు శిక్షపడేలా చాతుర్యాన్ని ప్రదర్శించిన ఎస్ఐ రమేష్ కుమార్, రైటర్ శంకరయ్య , సిసిటీ ఎన్ఎస్ రైటర్, రాఘవేందర్, పిసిలు భూపాల్ రెడ్డి, శివ గోపాల్, మొగుల య్యకు నగదు రివార్డులను అందజే శారు. నేరస్థులకు శిక్షపడటం వల్ల ప్రజల్లో పోలీస్ వ్యవస్థ పట్ల గౌరవం పెరుగుతుందని డిఎస్‌పి అన్నారు.


రివార్డులను అందజేస్తున్న డిఎస్, సిఐ

సిఎం రిలీఫ్ ఫండ్ పంపిణీలో అక్రమాలపై ఫిర్యాదు

మోమిన్‌పేట్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీలో మోమిన్‌పేట్ మండల ప్రజాప్రతినిధులు, నాయ కులు అక్రమాలకు పాల్పడ్డారని తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి కీర్తి రామకృష్ణ ఆరోపించారు. అర్హులైన లబ్ధిదారులకు కనీస సమాచారం ఇవ్వకుండా, అధికారులు లేని సమయంలో ఆదివారం గుట్టుచప్పుడు కాకుండా చెక్కులు పంపిణీ చేయడం వివాదాస్పదమైంది. కోల్కుంద గ్రామానికి చెందిన రాఘవేందర్ రెడ్డికి రూ. 1,43,203 విలువైన చెక్కు మంజూరైనట్లు మార్చి 10, 2026న ఫోన్ ద్వారా సమాచారం అందింది. అయితే చెక్కు తనకు అందలేదని బాధితుడు సర్పంచ్ కీర్తి రామకృష్ణను ఆశ్రయించారు.

అధికారులకు ఫిర్యాదు చేస్తున్న లబ్ధిదారుడు,మరియు సర్పంచ్ కరణం కీర్తి

దీనిపై స్థానిక తహశీల్దార్, ఎంపిడిఓ, పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో, మంగళవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రదీప్ తివారి, డీపీఓ జయసుధ, మరియు ఆర్డీఓ వాసుచంద్రలకు బాధితుడితో కలిసి ఫిర్యాదు చేశారు. ప్రజాప్రతినిధులే ఇలా వ్యవహరించడంపై ఆమె మండిపడుతూ, బాధితులకు న్యాయం జరగకపోతే రాష్ట్ర ప్రభుత్వం తదుపరి పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఆంజనేయులును సన్మానిస్తున్న అఖిల భారతీయ పద్మశాలి సంక్షేమ సంఘం నేతలు

ఉత్తమ కవి ఆంజనేయులుకు ఘన సన్మానం

మోమిన్‌పేట్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: మోమిన్పేట్ మండలం వెల్చాల్ గ్రామ నివాసి, కవి అవుసలి ఆంజనేయులుకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో అరుదైన గౌరవం లభించింది. అఖిల భారతీయ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆయనను ఉత్తమ కవిగా గుర్తించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ, తాను రాసే కవితలు, స్క్రిప్టులు, టీవీ సీరియల్స్ ద్వారా ఈ గుర్తింపు రావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. గతంలో జీవనోపాధి కోసం హైదరాబాద్ వెళ్ళి ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తూనే సాహిత్యంపై ఉన్న మక్కువతో కథలు, నాటకాలు రాసేవాడినని, ఇప్పుడు సినిమాల్లో కూడా చిన్నపాటి అవకాశాలు రావడం సంతోషకరమని పేర్కొన్నారు. తన ఎదుగుదలకు ఆంజనేయస్వామి ఆశీస్సులు ఉన్నాయని ఆయన భావోద్వేగానికి లోనయ్యారు.

వేదాద్రి ఆలయ అభివృద్ధికి రూ. 3 కోట్లు

తలకొండపల్లి, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలోని వేదాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని యాదాద్రి తరహాలో అభివృద్ధి చేయనున్నట్లు ఆలయ ధర్మకర్త శ్రీనివాసమూర్తి తెలిపారు. ఎంతో పురాతనమైన ఈ దేవాలయం గతంలో శిథిలావస్థకు చేరగా, భక్తులు మరియు దాతల సహకారంతో గుడి నిర్మాణం పూర్త యింది. పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చొరవతో, ఎమ్మెల్యే కసిరెడ్డి నారా యణరెడ్డి, ఎంపీ డాక్టర్ మల్లు రవి సహకారంతో ప్రభుత్వం ఈ దేవాలయ అభివృద్ధికి రూ. 3 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో ఆలయంలో మిగిలిపోయిన పనులు, కమ్యూనిటీ హాల్, కాటేజీల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని ధర్మకర్తలు పేర్కొన్నారు. నిధుల మంజూరు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గ్రామస్తులు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చిత్ర పటాలకు పాలాభిషేకం నిర్వహించారు.

స్పీకర్ నమ్మకాన్ని వమ్ము చేయను: బాబాఖాన్

మోమిన్‌పేట్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికే సముచిత స్థానం లభిస్తుందని శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ నిరూపించారు. గత ఎన్నికల సమయంలో స్పీకర్ ప్రసాద్ కుమార్ పై నమ్మకంతో పార్టీలో చేరిన మోమిన్పేట్ మండలానికి చెందిన వారాల సిరాజుద్దీన్‌కు డీసీసీ ప్రధాన కార్యదర్శిగా, దారూర్ మండలానికి చెందిన బాబా ఖాన్‌కు డీసీసీ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు. తమపై నమ్మకం ఉంచి పదవులు ఇచ్చినందుకు వారు స్పీకర్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీని మరింత బలోపేతం చేస్తామని వారు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్ల పంపిణీ

కుల్కచర్ల, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: గర్భిణులు మరియు బాలింతలు తప్పని సరిగా పౌష్టికాహారం తీసుకోవాలని రాంరెడ్డిపల్లి సర్పంచ్ కోస్గి నరసింహులు సూచించారు. కుల్కచర్ల మండలం రాంరెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గర్భిణులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా ఐరన్, కాల్షియం, మరియు విటమిన్లు కలిగిన ఆహారాన్ని అందుబాటులో ఉంచుతోం దని, పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే తల్లులు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయ పనుల్లో నాణ్యత పాటించాలి

కొడంగల్,ఏప్రిల్ 9, ప్రభాతవార్త : కొడంగల్ ప్రాంతంలోని శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఉన్న ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని, దాని పునర్నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సీఎం స్పెషల్ సెక్రటరీ శ్రీనివాసరాజు అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, కడా ప్రత్యేక అధికారి వెంకట్రెడ్డిలతో కలిసి ఆయన ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 110 కోట్లు మంజూరు చేసిందని.. నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. గర్భగుడి, ముఖ మండపం, కళ్యాణ మండపం, పార్కింగ్, తాగునీరు, క్యూలైన్ వ్యవస్థ వంటి మౌలిక సదుపాయాలను అద్భుతంగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించి ఆర్టీసీ బస్టాండ్, రోడ్డు విస్తరణ పనులు, బాలాజీనగర్‌లోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని కూడా పరిశీలించారు. డైరెక్టర్ ఆఫ్ కల్చర్ నర్సింహారెడ్డి, ఆర్అండ్‌బి ఎస్ఈ రాజేశ్వర్‌రెడ్డి, హౌసింగ్ కార్పోరేషన్ సీఈ చైతన్యకుమార్, అదనపు కలెక్టర్ రాజేశ్వరీ, కడా అభివృద్ధి అధికారి వెంకట్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శిని బదిలీ చేయకపోతే సమావేశాలు బహిష్కరిస్తాం

కొత్తూరు, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: కోడిచర్ల తండాలో కార్యదర్శి బదిలీ వివాదంకొత్తూరు మండలంలోని కోడిచర్ల తండా గ్రామ పంచాయతీలో రాజకీయ విభేదాలు మరోసారి బయటపడ్డాయి. పంచాయతీ కార్యదర్శి గుడాల మోనిక గత 7 ఏళ్లుగా ఇక్కడే కొనసాగుతున్నారని, ఆమెను వెంటనే బదిలీ చేయాలని డిప్యూటీ సర్పంచ్ స్వప్న రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో వార్డు సభ్యులు ఎంపీఓ విజయలక్ష్మికి ఫిర్యాదు చేశారు. కార్యదర్శి సర్పంచ్ వర్గానికి అనుకూలంగా ఉంటూ గ్రామంలో విభేదాలకు కారణమవుతున్నారని వారు పేర్కొన్నారు. ఈ నెలలో బదిలీ జరగకపోతే పంచాయతీ సమావేశాలు మరియు అభివృద్ధి పనులను బహిష్కరిస్తామని హెచ్చరించారు. దీనిపై స్పందించిన ఎంపీఓ, బదిలీకి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు .



మల్లాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

కొత్తూరు, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: కొత్తూరు మండలంలోని మల్లాపూర్ గ్రామంలో ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికఖిలో భాగంగా మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. స్థానిక సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలు చిన్న ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వం కల్పిస్తున్న ఇలాంటి ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దీప్తి ఆధ్వర్యంలో వైద్య బృందం గ్రామస్తులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేసింది.

నూతన బోరు మోటర్‌ను ఏర్పాటు చేస్తున్న స్థానికులు

తిర్మలాపూర్‌లో నీటి సమస్య పరిష్కారం

కుల్కచర్ల, ఏప్రిల్, 9, ప్రభాతవార్త: కుల్కచర్ల మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామ పంచాయతీలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టారు. గ్రామంలో నీటి సమస్యను గుర్తించి వెంటనే నూతన బోరు మోటార్‌ను ఏర్పాటు చేశారు. వేసవి కాలం దృష్ట్యా ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని నాయకులు నర్సింలు గౌడ్ మరియు ఉప సర్పంచ్ శివయ్య కోరారు.

సర్పంచ్ ఆరోపణలు నిరాధారం: డిప్యుటి ఏఈ

పెద్దేముల్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: పెద్దెముల్ తాండాలో బిటి రోడ్డు నిర్మాణానికి సంబందించి శిలాఫలకంపై తన పేరు లేదని సర్పంచ్ చేసిన ఆరోపణలు నిరాధారమైనవని గిరిజన సంక్షేమ విభాగం డిప్యుటి ఏఈ నిత్యానందస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నిత్యానందాస్వామి మాట్లాడుతు మండల పరిధిలోని పెద్దెముల్ తాండాలో బుద్దారం నుంచి పెద్దెముల్‌తాండా కెనాల్ రోడ్డు వరకు బీటి రోడ్డు నిర్మాణానికి సంబందించి ఈ నెల 8న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పెద్దెముల్ సర్పంచ్ శిలాఫలకంపై తన పేరు లేదని చేసిన ఆరోపణలు పూర్తిగా అసత్యమని, నిరాధారమైనవని అన్నారు. శంఖుస్థాపన జరుగుతున్న సమయంలోనే ఆయన పేరు శిలాఫలకంపై సరిగ్గా పొందుపరచబడిందని అన్నారు. అంతేగాకుండా సర్పంచ్ అట్టి కార్యక్రమానికి హాజరయ్యారని అన్నారు. శిలాఫలకం ప్రభుత్వ నిబందనల (ప్రోటోకాల్) ప్రకారం ఏర్పాటు చేయబడిందని అన్నారు.

మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలు అర్ధరహితం

చేవెళ్ల, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలు అర్థరహితం: బిజెపి మరియు ఆర్ఎస్ఎస్ సంస్థలను ఉద్దేశించి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలను చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అత్తిలి అనంతరెడ్డి తీవ్రంగా ఖండించారు. దేశ నిర్మాణంలో సేవలు అందించిన సంస్థలపై నిరాధార ఆరోపణలు చేయడం బాధాకరమని, రాజకీయ లాభాల కోసం ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని ఆయన విమర్శించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు అశోక్ చంద్రశేఖర్ రెడ్డి శ్రీకాంత్ రెడ్డి గణేశ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బిజెపి నాయకులు

ఎంఈఓపై ఆరోపణలకు కట్టుబడి ఉన్నా

పెద్దేముల్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: జనగణన విధులలో మండల విద్యాధికారి (ఎంఈఓ) వ్యవహరించిన తీరుపై తాను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని టీపీయూఎస్ మండల ప్రధాన కార్యదర్శి పట్లోల్ల అనిల్ స్పష్టం చేశారు. ఎంఆర్ఓ సమక్షంలో కేవలం భవిష్యత్తులో పొరపాట్లు చేయనన్న హామీ మేరకే ఎంఈఓకు క్షమాపణలు చెప్పానని, ఆరోపణలు తప్పు అని కాదని ఆయన వివరించారు.

నిలువ నీడలేని ప్రతి ఒక్కరికి ఇల్లు కటిస్తా

నందిగామ ఏప్రిల్ 9 ప్రభాతవార్త : దేశం కోసం ప్రాణాలను తృణపాయంగా అర్పించిన కాంగ్రెస్ పార్టీ నిరు పేదల పక్షపాతి అని, అర్హులైన ఉండి నిలువ నీడలేని ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తామని రంగాపూర్ సర్పంచ్ గోవు అంజమ్మ స్పష్టం చేశారు. గురువారం నందిగామ మం డలం రంగాపూర్ గ్రామంలో ఎరుకల నరసమ్మ నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బసవరాజ్, వార్డు సభ్యులు చదువుల సత్యనారాయణ, జింకల రామచంద్రి, తోట అవినాష్, నవ పేట శ్రీను, కావలి రాధ అంజయ్య, రాఘవేందర్, చందు, ముచ్చర్ల శ్రీరాములు, నాయకులు గోవు రవికుమార్ , నవ పేట రవీందర్ గౌడ్, జింకల జంగయ్య యాదవ్, ఎరుకల యాదయ్య, వెంకటేష్ తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవంలో పాల్గొన్న సర్పంచ్ అంజమ్మ

దేశ ప్రగతికి కార్మికులే పునాదిరాళ్లు

నందిగామ, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : మారుతున్న నేటి ఆధునిక యుగంలో దేశాభివృద్ధికి కార్మికులే పునాదిరాళ్లని డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె. శ్రీనివాసరావు, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎస్. జంగయ్యలు అన్నారు. నందిగామ మండలం మేకగూడ గ్రామ శివారులోని ఎంఎస్ఎన్ పరిశ్రమ 2లో సేఫ్టీ క్లస్టర్ హెడ్ అనిష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన భద్రతా వారోత్సవాల కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ హెడ్ సంగ్రామ్ భారీ, జకీర్ హుస్సేన్, ఇంజనీరింగ్ హెడ్ ఎస్.వి. కృష్ణారెడ్డి, క్వాలిటీ హెడ్ ఎస్. శ్రీనివాస్, హెచ్ఆర్ హెడ్ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.


భద్రత వారోత్సవాల్లో మాట్లాడుతున్న పరిశ్రమల ఇన్స్పెక్టర్

కరపత్రాల ద్వారా ఇంటింటికి పంపిణీ చేస్తున్న సిపిఐ నేతలు

ప్రజాపోరాటంలో ఎన్నో విజయాలు సాధించాం

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 9, ప్రభాత వార్త: సీపీఐ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పోచారం డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో గురువారం ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. ఆపార్టీ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు కల్లూరు జయచంద్రలు మాట్లాడుతూ సీపీఐ పార్టీ వంద సంవత్సరాల చరిత్రలో 142 మంది కోట్ల ప్రజలకు ఎన్నో రకాలుగా సేవలు అందించిందని అన్నారు. దేశ ప్రగతి కొరకు సమాజ నిర్మాణానికి జరిగే మహా ఉద్యమంలో వేల వీర కిరణాలు పణంగా పెట్టి ప్రజల పక్షాన నిలిచిందని అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో చట్టసభలో చేసిన చట్టాలే నేటికి మనదేశంలో కొనసాగుతున్నాయని అన్నారు. ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత, కార్మికుల యాక్టు, రైతుల భద్రత, గిట్టుబాటు ధరలు కల్పించడంలో సీపీఐ పాత్ర దేశంలోనే గొప్పదని అన్నారు. తమ పార్టీ వంద సంవత్సరాల చరిత్రలో సాధించిన విజయాలనే కరపత్రాల ద్వారా ప్రజల దగ్గరుకు వెళ్లుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సీపీఐ నాయకులు సదాశివ, మురళి,బి. శ్రీనివాస్ చౌదరి, అంజి, మహేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం కాలనీలో స్థానికులతో సమావేశమైన సిపిఎం నేతలు

' డబుల్ ' విక్రయాలు విరమించుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: డబుల్ బెడ్‌రూం కాలనీల్లో నిర్మించిన దుకాణ సముదాయాలకు వేలం పద్ధతిలో విక్రయించడాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సత్యం డిమాండ్ చేశారు. పోచారం డివిజన్ వెంకటాపూర్ పరిధిలో గల డబుల్ బెడ్రూం ఇండ్లను సీపీఎం నాయకులు సందర్శించారు. కాలనీవాసులతో సమావేశమైన సీపీఎం నాయకులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా గల 16 డబుల్ బెడ్రూం కాలనీల్లో 992 వాణిజ్య సముదాయాలు ఉన్నాయని వాటిని వేలం పద్దతిలో విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించడం ఉపసంహరించుకోవాలని అన్నారు. కాలనీల్లో నివాసం ఉంటున్న వారు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని సమస్యలు పరిష్కరించకుండా కాలనీల్లో నిర్మించిన కమర్షియల్ షాపులను విక్రయించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. అవే షాపులను అద్దెకు ఇచ్చినట్లయితే వచ్చిన ఆదాయంతో కాలనీల్లో విద్యుత్, లిప్టుల మెయింటెన్స్ ఇతర అవసరాలు తీరుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కోమటి రవి, ఏర్ర అశోక్, పార్టీ సీనియర్ నాయకులు చింతల యాదయ్య, మండల కార్యదర్శి ఎన్. సబిత, చంద్రమోహన్, కాలనీ అసోసియేషన్ డైరెక్టర్ వరప్రసాద్‌రెడ్డి, అధ్యక్షుడు కమలాకర్, చందు. ఎం. రమా,ఉషా, సుమతి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులు

ఎయిడ్స్ నిరోధానికి అవగాహన ర్యాలీ

షాద్‌నగర్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : చించోడులో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్.ఐ.వి/ ఎయిడ్స్ వ్యాధి నిరోధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ ఎయిడ్స్ సోకిన వారిలో రోగ నిరోధక శక్తి తగ్గిపోతుందని చెప్పారు. ఈ వ్యాధి బారిన పడకుండా సురక్షితమైన సెక్స్ పద్ధతులు అనుసరించాలన్నారు. రక్త మార్పిడి చేసేట ప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు, హెల్తు సూపర్వైజర్లు శ్రీరామ, చంద్ర కళ, స్టాఫ్ నర్స్ సువర్ణ, ల్యాబ్ టెక్నీషియన్ అశోక్, డీఈవో విజయ, ఏఎన్ ఎంలు, ఆశాలు, కాంటిజెంట్ వర్కర్ శ్రీనివాస్, మన్నెమ్మ పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్సీ

సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణి

షాద్‌నగర్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సిఫారసుతో

షాద్‌నగర్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు లకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్సీ కార్యాలయంలో లబ్ధిదారులకు బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మామిడిపల్లి సర్పంచ్ హన్మంత్ రెడ్డి, ఈదులపల్లి సర్పంచ్ సులోచన గణేష్ గౌడ్, మామిడి పల్లి మాజీ ఎంపిటిసి కాట్న రవీందర్, పాపిరెడ్డిగూడ మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణు వర్ధన్ రెడ్డి,అప్పారెడ్డిగూడ మాజీ సర్పంచ్ జెకే నరసింహ, బుగ్గన గూడ మాజీ సర్పంచ్ రాజు, మామిడిపల్లి ఉపసర్పంచ్ మామిలపల్లి రాజు, మేకగూడ మాజీ ఉపసర్పంచ్ నర్సిములు, నాయకులు జయరాం గౌడ్, నర్సిమ గౌడ్, బండి మల్లయ్య, డివిటి నర్సింహ్, సత్యనారాయణ, పురుషోత్తం రెడ్డి, శ్రవణ్ గౌడ్, వార్డు మెంబెర్స్ శ్రీపాల్ రెడ్డి, ప్రభు, మమతాకిరణ్ గౌడ్, ప్రభా కర్, అనిత అశోక్, మురళి, రాము, రవి, మల్లేష్ రాజు, శేఖర్ పాల్గొన్నారు.

ప్రాథమికోన్నత పాఠశాలగా అప్ గ్రేడ్ చేయండి

షాద్‌నగర్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : షాద్‌నగర్ మున్సిపాలిటీ 16వ వార్డ్ క్రిస్టియన్ కాలనీలో ఉన్న చిన్నకుంట ప్రాథమిక పాఠశాలను, ప్రాథమికోన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని స్థానిక కౌన్సిలర్ ఒగ్గు జయలక్ష్మి కిషోర్ మండల అధికారి వినతి పత్రం అంద చేశారు. గతంలో కూడా మాజీ వైస్ చైర్మన్ నటరాజ్ మాజీ కో అప్షన్ సభ్యులు ఒగ్గు కిషోర్ ప్రతిపాదన చేశారని చెప్పారు. అప్పట్లో 16 లక్షల రూపా యలతో కాంపౌండ్ వాల్ నిర్మా ణం స్కూల్ బెంచీలు వాష్ రూ మ్‌లు నిర్మించారని గుర్తు చేసా రు. ఐడీబీఐ బ్యాంక్ ద్వారా వాటర్ ప్లాంట్, కంప్యూటర్‌లు కూడా ఏర్పాటు చేయడానికి కృషి చేశా మన్నారు. వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వచ్చే విద్యా సంవత్సరానికి అయినా క్రిస్టియన్ కాలనీ పాఠశాలలో విద్యార్థులకు 7వ తరగతి వరకూ చదువుకునే అవకాశం కల్పించాలని కోరారు.


ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్

వివాదాస్పద స్థలాన్ని పరిశీలిస్తున్న రెవిన్యూ పోలీసు అధికారులు

శివంపేటలో వివాదాస్పదంగా మారిన శిలువ ఏర్పాటు

-స్థలాన్ని పరిశీలించిన అధికారులు, పోలీసులు

చౌటకూరు, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: మండల పరిధిలోని శివంపేటలోని పెద్ద చెరువు శిఖం భూమిలో గ్రామానికి చెందిన ఓ వర్గం శిలువ ఏర్పాటు చేయడం వివాదాస్పదంగా మారింది. ఈ నెల 3న జరిగిన గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని యువకులు 161వ జాతీయ రహదారి పక్కలో పెద్ద చెరువు శిఖం భూమిలో శిలువను ఏర్పాటు చేశారు. ఈస్టర్ పండగను సైతం ఆ వర్గం ప్రజలు కొత్తగా ఏర్పాటు చేసిన శిలువ వద్దనే వేడుకలను జరుపుకున్నారు. వేడుకలు పూర్తయినా శిలువను అక్కడి నుంచి తొలగించకుండా అలాగే ఉంచేశారు. గ్రామానికి చెందిన మరో వర్గం పెద్ద చెరువు శిఖం భూమిలో శిలువ ఏర్పాటు చేసి కబ్జా చేశారంటే జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పి, తదితర అధికారులకు ఫిర్యాదు చేశారు. జిల్లా అధికారుల ఆదేశం మేరకు తహసీల్దార్ నామాల కిష్టయ్య, పుల్‌కల్ ఎస్ఐ విశ్వజన్, రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ ప్రమోద్‌కుమార్, నీటి పారుదల శాఖ ఏఈ నిశిత, సర్వేయర్ యాదయ్యలు గురువారం సంఘటన ప్రాంతానికి చేరుకుని శిలువ పాతిన వారే శిలువను తొలగించాలని అధికారులు హుకుం జారీ చేశారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరిగోడకు ఆనుకుని జాతీయ రహదారరి సర్వీసు రోడ్డు వద్ద ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు భూమి పూజలు చేసి, జండా పాతారంటూ అధికారుల దృష్టికి ఓ వర్గం ప్రజలు తీసుకుపోయారు. పాతిన జండాను సైతం తొలగించాలంటూ పట్టుబట్టారు. ఆదివారం లోగా శిఖం భూమిలో పాతిన శిలువ, జెండాలను తొలగించాలంటూ అధికారులు నిర్వాహకులకు సూచించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు

-ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావ్

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 9,ప్రభాతవార్త: అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు

చిన్నశంకరంపేటలో కల్యాణలక్ష్మీ చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావ్

అందుతాయని ఎవరూ అధైర్య పడవద్దని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావ్ తెలిపారు. గురువారం చిన్నశంకరంపేట పట్టణంలో వివిధ గ్రామాలకు చెందిన 19లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులను అందించారు. కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, గత పాలకుల నిర్లక్ష్యం వల్లే మెదక్ జిల్లా అభివృద్ధికి దూరమైందన్నారు. జిల్లాలో ఏ గ్రామంలో చూసిన ఇందిరమ్మ ఇండ్లు కనిపిస్తాయని తెలిపారు. అనంతరం మదూరులో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాన సత్యనారాయణ, సర్పంచ్‌లు గోపాల్‌రెడ్డి, దివ్యభారతి, లింగాగౌడ్, మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 9,ప్రభాతవార్త: చిన్నశంకరంపేట మండల పరిధి టీ మాందాపూర్ తండాకు చెందిన ప్రసాద్, తిరుమలమ్మల 18 నెలల చిన్నారి ఇటీవల నీటి బకెట్లో పడి మృతి చెందింది. అలాగే, సూరారంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ సత్యనారాయణ తండ్రి ఇటీవల అనారోగ్య సమస్యతో బాధపడుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు గురువారం బాధిత కుటుంబాలను పరామర్శించారు.

యువతకు మార్గదర్శకంగా నిలుస్తున్న ఎన్ఎస్‌యూఐ

మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మికొమురయ్య

హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : యువతకు మార్గదర్శకంగా ఎన్ఎస్‌యూఐ (నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా) నిలుస్తోందని హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మికొమురయ్య అన్నారు. గురువారం రోజున హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో ఎస్ఎస్‌యూఐ 56వ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణ కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఎస్ఎస్‌యూఐ సంఘం నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు.

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి

అనంతరం మాట్లాడుతూ విద్యార్థుల హక్కుల కోసం ఎస్ఎస్‌యూఐ ఎప్పటికప్పుడు పోరాటం చేస్తూ యువతకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ చిత్తారి పద్మరవిందర్, విప్ కేశవేని రమేష్‌తో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి నాయకులు పట్టణ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పాడి గేదెల పంపిణీ పథకం దరఖాస్తు గడువు పొడిగింపు

సిద్దిపేట, ప్రభాతవార్త : ప్రతినిధి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎస్సీ కార్యాచరణ ప్రణాళిక 2025,26 కింద అమలు చేస్తున్న పాడి గేదెల పంపిణీ పథకం దరఖాస్తు గడువును ఈ నెల 16వ తేదీ వరకు పొడిగించినట్లు ఎస్సీ కార్పొరేషన్ సిద్దిపేట జిల్లా కార్యనిర్వాహక సంచాలకులు బి. విజయ్ భార్గవ్ తెలిపారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డు, మీ సేవ ద్వారా పొందిన ఆదాయ ధృవీకరణ పత్రం, పట్టాదారు పాస్‌బుక్, ఫోటోలుతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాల్సి ఉంటుందని, దివ్యాంగులు అయితే సదరం సర్టిఫికేట్ జతపరచాల్సి ఉంటుందని తెలిపారు. గేదెల పోషణకు కనీసం 10 గుంటల వ్యవసాయ భూమి ఉండాలని, ఒకవేళ భూమి లేకపోతే గడ్డిని కొనుగోలు చేసి గేదెలను పోషించే సామర్థ్యం ఉండాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా ఆన్‌లైన్ దరఖాస్తు పూర్తి చేసి, దరఖాస్తు ప్రతితో పాటు అవసరమైన ధృవీకరణ పత్రాలను గ్రామీణ ప్రాంతాల వారు సంబంధిత ఎంపీడీవో కార్యాలయంలో, పట్టణ ప్రాంతాల వారు మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. అర్హులైన ఎస్సీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

హమాలి కార్మిక సంఘం అధ్యక్షునిగా భూక్య ప్రవీణ్ నాయక్

అక్కన్నపేట, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : అక్కన్నపేట మండలం కెప్టెన్ చౌడు తండా గ్రామపంచాయతీలో ఐకెపి సెంటర్ ప్రారంభం కావడంతో హమాలి కార్మిక సంఘం ఏర్పాటు చేయాలని గ్రామ సర్పంచ్ స్వరూప రాజునాయక్, ఉప సర్పంచ్ అర్జున్ నాయక్ గ్రామస్తులకు సూచించారు. ఈ సందర్భంగా గురువారం గ్రామస్తులు సమావేశమై హమాలి కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేసి, సంఘం అధ్యక్షునిగా భూక్య ప్రవీణ్ నాయక్‌ను, ఉపాధ్యక్షునిగా సర్దార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఎన్నిక చేసిన గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

టేక్మాల్‌లో చలివేంద్రం ప్రారంభం

టేక్మాల్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త : టేక్మాల్‌కు చెందిన ఫోటో ఫన్ ఫ్లెక్సీ సంస్థల అధినేత షేక్ మజ్జాహర్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. షేక్ మజ్జాహర్,షేక్ బాబా,షేక్ అషీఫ్ తమ్ముడుల సొంత కష్టార్జితంతో ప్రతీ ఏటా టేక్మాల్ బస్ స్టాండ్ సమీపంలో ఫోటోఫన్ స్టేషనరీ జిరాక్స్ స్టూడియో, పక్కన చలి వేంద్రం ఏర్పాటుచేసి ఇతరులకు ఈ ముగ్గురు అన్నదమ్ములు ఆదర్శంగా నిలుస్తారని చెప్పుకోవచ్చు. వేసవి తీవ్రమైన ఎండలు మండుతుండటంతో టేక్మాల్‌కు వివిధ పనుల మీద వచ్చే ప్రజలు,వివిధ పాఠశాలల విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు ఈ చలి వేంద్రం ఎంతగానో దోహద పడుతున్నదని అన్ని దానాల కన్నా..మంచినీళ్ల దానం గొప్పది అంటారు. పెద్దలు...అదే సూక్తిని మాటల్లో కాదు చేతల్లో ఆచరించి నిరూపణ చేసి చూపించారని మజ్జాహర్,బాబా, ఆసీస్‌లను అభినందిస్తున్నారు. కార్యక్రమంలో టేక్మాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిమ్మ రమేష్ , బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బత్తుల వీరన్న, మెదక్ జిల్లా డిసిసి ప్రధాన కార్యదర్శి ఆశల సాగర్, మాజీ సర్పంచ్ ఆకులపల్లి పాపయ్య టౌన్ ప్రెసిడెంట్ భక్తుల కిషోర్, మాజీ ఎంపీటీసీ కమ్మరి సిద్దయ్య, వార్డ్ మెంబర్ శివయ్య, మాజీ ఉపసర్పంచ్ శివయ్య్, తదితరులు పాల్గొన్నారు.

విధినిర్వహణలో అలక్ష్యం వహిస్తే చర్యలు

-అధికారులతో ప్రజా సమస్యలపై చర్చిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

-తమ గోడు వెళ్లబోసుకున్న ప్రజలు

కంగ్టి, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: మండల కేంద్రమైన కంగ్టిలోని బసవ ప్రదీప్ కళ్యాణ మండపంలో గురువారం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలపై ప్రజలతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రజలు విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల నిర్లక్ష్యం మూలంగా తాము పడుతున్న పాట్లను ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. అధికారులు తమ ఇష్టారీతిగా వ్యవహరిస్తుండటంతో విద్యుత్ కనెక్షన్‌ల కొరకు డిడిలు కట్టి రెండేళ్లు గడుస్తున్నా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్థంభాలు ఏర్పాటు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ నీరు రాని రోజుల్లో వ్యవసాయ బోర్ల నుంచి నీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం నెలకు 6వేల రూపాయలను చెల్లిస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విధి నిర్మహణలో అలక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ, వాటర్ డిఈలకు ఎమ్మెల్యే సూచించారు. గ్రామాల్లో తాగునీరు సరఫరా కాని రోజు పంచాయితీ కార్యదర్శులు గ్రామ ప్రజల నుంచి సంతకాలు సేకరించి పంపాలని ఆదేశించారు. వేసవి కాలం వచ్చినందున ప్రజలు విద్యుత్, తాగునీటి కొరకు ఇబ్బందులు పడకుండా అయా శాఖల అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. రైతాంగానికి విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఎదురుకాకుండా చూసుకోవాలన్నారు. గ్రామాల్లోని ప్రతి ఇంటికి

అధికారులతో ప్రజా సమస్యలపై చర్చిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

తాగునీరు సక్రమంగా నిత్యం సరఫరా అయ్యేలా చేసుకోవాలని ఆర్‌డబ్లుఎస్ అధికారులను ఎమ్మెల్యే సూచించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను తెలుసుకుని వెను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, విద్యుత్, ఆర్‌డబ్లుఎస్ ఉన్నతాధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రెండేళ్లు నిండిన జిపిఒలకు ప్రొబేషన్ ప్రకటించండి

పుల్‌కల్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: వీఆర్ఏ నుంచి జీపీవోలుగా నియమితులై రెండేళ్లు పూర్తి చేసుకున్న వారికి ప్రొబిషన్ ప్రకటించాలని గ్రామ పాలన అధికారుల అసోసియేషన్ తెలంగాణ జిల్లా కమిటి నాయకుఉలు జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను కోరారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో గురువారం నాయకులు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 6, 12, 18 ఏండ్లు పూర్తి చేసుకున్న వారికి స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్‌లు ఇచ్చి జీపీఓలకు మ్యూచువల్ పోస్టింగ్‌లు మంజూరు

కలెక్టర్ ప్రావీణ్యకు వినతి పత్రం అందచేస్తున్న జీపీఓల దృశ్యం

చేయాలని వినతి పత్రంలో కోరామన్నారు. జిల్లాలో రెండు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న జిపిఒలకు ప్రొఫెషనల్ ప్రకటించాలన్నారు. జిపిఒలు ఇతర శాఖల నుంచి వచ్చినందుకు సర్వీస్ నియామకం జరుగలేదని, దీంతో తమకు నష్టం వాటిల్లకుండా న్యాయం చేయాలన్నారు.60 కిలో మీటర్ల నుంచి 120 కిలో మీటర్ల వరకు పని చేస్తున్న తమకు దూర ప్రాంత విధులు భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిపికొఎటిజి జిల్లా అధ్యక్ష, కార్య దర్శులు నాయికోటి సత్యానారాయణ, బి లక్ష్మణ్, నాయకులు సుజాత, శివరామకృష్ణ, రామ చంద్రయ్య, శివరాం, ఇఫ్తేకర్, శంకరయ్య తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తా

నియోజకవర్గ ఇన్‌చార్జి : పూజల హరికృష్ణ

సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : సిద్దిపేటకు చెందిన 14 భవన కార్మిక సంఘాల నాయకులు, జిల్లా భవన కార్మిక సంఘం అధ్యక్షులు శ్రీశైలం నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణను గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీకార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, సంక్షేమ పథకాల అమలులో ఎదురవుతున్న ఇబ్బందులను విన్నవించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర కార్మికశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి దృష్టికి కార్మికుల సమస్యలను తీసుకెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. త్వరలోనే కార్మికశాఖ మంత్రి

భవన కార్మిక సంఘాల ప్రతినిధులతో మాట్లాడుతున్న హరికృష్ణ

వివేక్‌వెంకటస్వామితో సమావేశం ఏర్పాటు చేసి భవన కార్మికుల సమస్యలపై చర్చించి పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. భవన కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ సర్కార్ ఎప్పుడు కట్టుబడి పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో భవన కార్మిక సంఘాల ప్రతినిధులు, పార్టీ నాయకులు బొమ్మల యాదగిరి, కలీం, బిక్షపతి, లక్ష్మీ, మహేష్, కృష్ణమూర్తి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కారాగారంలో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న వైద్యులు

జిల్లా జైలులో ప్రత్యేక వైద్య శిబిరం

కంది, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రమైన కందిలోని జిల్లా కేంద్ర కారాగారంలో హైద్రాబాద్‌లోని కోఠిలోని కమీషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, మిషన్ డైరెక్టర్ అభ్యర్థన మేరకు తెలంగిణ రాష్ట్ర జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ డాక్టర్ సౌమ్య అనుమతితో జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ ఆర్ పాండు ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డిఎంఅండ్‌హెచ్‌ఓ వసంతరావు సమక్షంలో వైద్యులు కారాగారంలోని స్త్రీ, పురుష ఖైదీలకు ఎక్స్‌రే హెచ్ఐవి, సెఫలీస్, హెచ్‌బి ఎష్ఎజి, బిపి, షుగర్, కండ్ల పరీక్షలు నిర్వహించారు.

చెరువుల పూడిక తీత పనులు భూగర్భ జలాలను పెంచుతాయి

కొండపాక, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండల పరిధిలోని లకుడారంలో చెరువుల పూడిక తీత పనులను సర్పంచ్ శిల్ప నర్సింలు, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు గట్టు చంద్రం, వంకాని రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ లావణ్య చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెంచడానికి రైతులకు మేలు చేయడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. చెరువులలో మట్టి తీయడం మూలంగా నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. అదే మట్టిని పొలాల కొట్టించడం మూలంగా భూసారం పెరిగి అధిక పంటలు పండే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పనీందర్, కంకణాల బిక్షపతి, చింతల మహేందర్, శ్రీనాథ్, కరుణాకర్ పాల్గొన్నారు.

చెరువుల పూడిక తీత పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

సింగన్నగూడని అభివృద్ధి పథంలో తీసుకెళ్తాం

-గ్రామ సర్పంచ్ నాగరాణి స్వామిగౌడ్

ములుగు, ఏప్రిల్ 9 (ప్రభాతవార్త): మండల పరిధిలోని సింగన్నగూడ గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో తీసుకెళ్తామని గ్రామ సర్పంచ్ కంచనపల్లి నాగరాణి స్వామిగౌడ్ పేర్కొన్నారు. కోక కోల కంపెనీ వారి సహకారంతో సుమారు రూ.15 లక్షల సిఎస్ఆర్ నిధుల ద్వారా అంగన్వాడీ రెన్నోవేషన్ పనులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వాటర్ ఫ్లాంట్, గ్రామ పంచాయతీకి వాటర్ ప్లాంట్ మరియు చెత్త తరలింపుకై ఎలక్ట్రిక్ వాహనాన్ని అందించగా వాటిని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగరాణి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం నిధులను సమకూర్చిన కోక కోల కంపెనీ వారికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి కంపెనీ వారు సహకరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ చరణ్‌రాజు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి సతీష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బి.బాలకృష్ణ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ నాగరాణి స్వామిగౌడ్

సిసి కెమెరాల ఏర్పాటుతో గ్రామాలకు భద్రత: సిఐ లతీఫ్

సమీక్ష సమావేశంలో పాల్గొన్న వివిధ గ్రామాల సర్పంచ్‌లు

రాయపోల్, ఏప్రిల్ 9 (ప్రభాతవార్త): సిసి కెమెరాల ఏర్పాటుతో గ్రామాలకు భద్రత పెరుగుతుందని స్థానిక సిఐ లతీఫ్, ఎస్ఐ మానసలు పేర్కొన్నారు. గురువారం మండలకేంద్రమైన రాయపోల్‌లో గ్రామ భద్రత, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పనపై వివిధ గ్రామాల సర్పంచులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో నేరాలను అరికట్టడానికి సిసి కెమెరాల ఏర్పాటు అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ముఖ్య కూడళ్లు, పబ్లిక్ ప్రదేశాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేర నియంత్రణకు తోడ్పడుతుందని వివరించారు. దీనిపై సర్పంచులు స్పందించి సిసి కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని సూచించారు. అలాగే సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించనున్న ఉద్యోగ మిత్ర కార్యక్రమంపై కూడా అవగాహన కల్పించారు. నిరుద్యోగ యువత ఈ కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ చేసుకుని ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందుకు గ్రామ స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించి, ఎక్కువ మంది యువత పాల్గొనేలా చూడాలని సర్పంచ్‌లకు సూచించారు.

సిసి రోడ్డు నిర్మాణం పనులు నిర్వహిస్తున్న దృశ్యం.

టేక్మాల్‌లో సిసి రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

టేక్మాల్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త : అభివృద్దే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని టేక్మాల్ గ్రామ సర్పంచ్ సుధాకర్ అన్నారు. గురువారం టేక్మాల్‌లో ఎస్సీ కాలనీలోని సీసీ రోడ్ల నిర్మాణం పనులు ప్రారంభించారు. ఎస్సీ కాలనీలో రోడ్డు అధ్వాన్నంగా మారడంతో ప్రజల ఇబ్బందులు గుర్తించి మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లగా మంత్రి వెంటనే స్పందించి ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా 5 లక్షలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా టేక్మాల్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ తిమ్మిగారి సుధాకర్ ,మండల కాంగ్రెస్ అధ్యక్షులు నిమ్మ రమేష్ మాట్లాడుతూ మంత్రి దన్యవాదాలు తెలియజేస్తూ సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఉప సర్పంచ్ మేకల కాడి శంకరయ్య ,మెదక్ జిల్లా కాంగ్రెస్ కమిటీ మైనార్టీ చైర్మన్ షేక్ మజహర్, మెదక్ జిల్లా డీసీసీ జనరల్ సెక్రటరీ ఆశల సాగర్,మాజీ సర్పంచ్ ఆకులపల్లి పాపయ్య, టౌన్ ప్రెసిడెంట్ బత్తుల కిషోర్ ,వార్డ్ మెంబర్, శివ గౌడ్, సాకలి యాదయ్య, కేశి రెడ్డి, సోలాపూర్ రాజు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారుబీ

పంచాయితీ కార్యదర్శులు, సర్పంచ్‌ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

సమన్వయంతో సమస్యలకు పరిష్కారం

-అవినీతికి పాల్పడితే ఏసిబికి పట్టిస్తాం

-అధికారులకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి హెచ్చరిక

నాగల్‌గిద్ద, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసుకుంటే ప్రజల సమస్యలను సునాయసంగా పరిష్కరించుకోవచ్చని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన నాగల్‌గిద్దలోని రైతు వేదికలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులతో ఎమ్మెల్యే ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి ఆమడ దూరంలో ఆగిపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధే లక్ష్యంగా, ప్రజా సంక్షేమమేలక్ష్యంగా పాలన సాగిస్తోందని, విద్యుత్ అధికారుల తీరుపై ఎమ్మెల్యేతో పాటు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులు తమ పనితీరును మార్చుకుని ప్రజలచే మెప్పు పొందాలని, అధికారులు అవినీతికి పాల్పడితే ఏసిబి అధికారులకు పట్టివ్వడం తధ్యమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పెయింటర్ అసోసియేషన్ మండల అధ్యక్షునిగా బొట్ల పరశురాం

బెజ్జంకి, ఏప్రిల్ 9,ప్రభాతవార్త : బెజ్జంకి మండల పెయింటర్ అసోసియేషన్ అధ్యక్షులుగా బొట్ల పరుశురాం గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలోని బెజ్జంకిలో గురువారం నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కొంపెల్లి ఓం ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా నల్గొండ కరుణాకర్, కోశాధికారిగా లింగాల శంకర్, సంయుక్త కార్యదర్శిగా గున్నాల భాస్కర్, ప్రచార కార్యదర్శిగా మూడపట్ల కుమార్, గౌరవాధ్యక్షులుగా రాజమల్లులను ఎన్నుకున్నారు.

పదవీ విరమణ పొందిన ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పదవీ విరమణ పొందిన ప్రిన్సిపాల్‌కు సన్మానం

పుల్‌కల్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: మండలంలోని సింగూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఆగమయ్యకు గురువారం ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, పోషకులు ఆగమయ్యను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందచేశారు. పాఠశాలలో దీర్ఘకాలంగా సేవలందించిన ప్రిన్సిపాల్ ఆగమయ్య సేవలు మరవలనివని ఉపాధ్యాయులు, పోషకులు కొనియాడారు. విద్యా ప్రమాణాల మెరుగుకు ఆగమయ్య సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని ఘనంగా ప్రిన్సిపాల్‌కు వీడ్కోలు పలికారు.

-విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపు

విధి నిర్వహణలో అంకితభావంతో చేసిన సేవలను ప్రజలు కలకాలం గుర్తించుకుంటారని మండల విద్యాధికారి శంకర్, వ్యవసాయ శాఖ సంచాలకులు వైద్యనాథ్‌లు అన్నారు. పదవీ విరమణ పొందిన ప్రిన్సిపాల్ ఆగమయ్య దంపతులను అధికారులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సింగూరు, కొండాపూర్, నారాయణఖేడ్, ఎల్లారెడ్డి తదితర గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

చిన్నకోడూరు, ఏప్రిల్ 9, ప్రభాతవార్త :మండల

వైద్య శిబిరంలో ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

పరిధిలోని గంగాపూర్ గురువారం ఆర్‌విఎం ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 10 మంది వైద్యులు, సిబ్బంది పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. గుండె, కళ్లకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుండెల్లి భవాని వేణుయాదవ్, వార్డు సభ్యులు బుర్ర కిషన్‌గౌడ్, పందిళ్ల తిరుపతి, ముత్యం మంజుల, ముత్యం లతా, పీరెల్లి బాలమణి, ఎర్ర నిర్మల, గ్రామస్తులు పాల్గొన్నారు.

సబ్సిడీపై రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

వ్యయసాయ పరికరాలు పంపిణీ

తొగుట,ఏప్రిల్ 9, ప్రభాతవార్త : తొగుట మండలంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మండలానికి సంబంధించిన 10 మంది రైతులకు సబ్సిడీపై రూ.13 లక్షల 727 విలువైన 10 రోటవేటర్లు ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్‌రెడ్డి చేతుల మీదుగా గురువారం రైతులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాటాడుతూ గత ప్రభుత్వం వ్యవసాయ పనిముట్లపై ఎలాంటి సబ్సీడి ఇవ్వలేదన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాతనే రైతులకు సబ్సీడిపై వ్యవసాయ పనిముట్లు అందించడం జరుగుతుందన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో రూ.54 లక్షల వ్యవసాయ పనిముట్లు సబ్సీడపై వచ్చాయన్నారు. అర్హులైన రైతులు వ్యవసాయ పనిముట్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో మోహన్, ఎఎంసి వైస్ చైర్మన్ కొంగరి నరసింహులు, సర్పంచ్‌లు, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.



స్థల పరిశీలన చేస్తున్న డిఈఓ శ్రీనివాస్‌రెడ్డి

యంగ్ ఇండియా పాఠశాలకు స్థల పరిశీలన

కొండపాక, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : మండల కేంద్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మంజూరు చేసిన యంగ్ ఇండియా పాఠశాల కోసం గురువారం డిఈవో శ్రీనివాస్‌రెడ్డి స్థల పరిశీలన చేశారు. ఆయన వెంట తహశీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, సీఓ రామస్వామి, ఎఈ, కొండపాక, రవీంద్రనగర్ సర్పంచ్‌లు, టిజిఎంఎస్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

మహిళా బిల్లుకు మద్దతు తెలపాలి

జహీరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: దేశ రాజకీయాల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెడుతున్న మహిళా రిజర్వేషన్‌ల బిల్లుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు బేషరతుగా మద్దతు తెలపాని జహీరాబాద్ బిఆర్ఎస్ నాయకురాలు, జహీరాబాద్ మున్సిపల్ 27వ వార్డు కౌన్సిలర్ నామ స్రవంతి రవికిరణ్ విజ్ఞప్తి చేశారు. పార్టీల పరస్పర విభేదాలను పక్కన పెట్టి, మహిళా సాధికారత కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెడుతున్న బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించాలన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపి లు, వివిధ స్థాయిలో ఉన్న ప్రజాప్రతినిధులు చారి త్రాత్మక బిల్లుకు మద్దతు పలకడంతో దేశ భవిష్యత్తుకు బాటలు వేసినట్లు అవుతుందని, చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు లభిస్తేనే నిజమైన ప్రజాస్వామ్యం ఫరిడవిల్లుతుందన్నారు. బిల్లు ఆమోదం పొందేందుకు ప్రతి ఒక్కరరు తమ వంతుగా మద్దతు పలకాలని వనతి చేశారు.

బిఆర్ఎస్ కౌన్సిలర్ నామ స్రవంతి రవికిరణ్

తెలంగాణ పంచాయతీ సెక్రెటరీస్ సెంట్రల్ ఫోరం డైరీ-2026, డిస్ట్రిక్ట్ ఫోరం సంగారెడ్డి జిల్లా స్టిక్కర్ ను ఘనంగా ఆవిష్కరించిన ఎమ్మెల్యే

గ్రామాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలి

నారాయణఖేడ్, ఎప్రిల్ 9, ప్రభాతవార్త : తెలంగాణ పంచాయతీ సెక్రెటరీస్ డిస్ట్రిక్ట్ ఫోరం సంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రటరీ జె.రాజు, ట్రెజరర్ రమేష్, నారాయణఖేడ్ యూనిట్ టీఎన్‌జీఓ జనరల్ సెక్రటరీ మిస్కిన్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, అరవింద్, కమిటీ సభ్యులు పవన్, బాలు, సుభాష్, నాగలక్ష్మి, జనార్ధన్ రెడ్డి మండల అధ్యక్షులైన రాజ్ రెడ్డి, ప్రవీణ్, అనిల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ టిపిఎస్‌సిఎఫ్ సంఘం పంచాయతీ కార్యదర్శుల హక్కుల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, వారి సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సంగారెడ్డి జిల్లా పంచాయతీ కార్యదర్శుల జిల్లా ఫోరం అధ్యక్షులు జగన్, జనరల్ సెక్రెటరీ రాజు, అసోసియేట్ ప్రెసిడెంట్ విద్యాధర్ గౌడ్, కోశాధికారి రమేష్ మరియు కమిటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ప్రజాపాలనలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర ఎంతో కీలకమని, గ్రామాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. అలాగే పంచాయతీ కార్యదర్శుల డిప్యుటేషన్ పై ప్రస్తావించారు. తదనంతరం ఖేలో ఇండియా నేషనల్స్ క్రీడలలో రెజ్లింగ్ (గిరిజన) విభాగంలో భాగంగా జాతీయ స్థాయిలో కాంస్య పతకం సాధించిన పంచాయతీ కార్యదర్శి కర్ర రాజుని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫోరం నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

విద్యుత్‌శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులతో సమీక్ష

నారాయణఖేడ్, ఎప్రిల్ 9, ప్రభాతవార్త : నారాయణఖేడ్ మండల పరిధిలోని విద్యుత్ మరియు గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) శాఖల అధికారులతో గౌరవ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలు మరియు తాగునీటి ఎద్దడిపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. సమీక్షా సమావేశంలో ఎండాకాలం దృష్ట్యా మండలంలోని ఏ ఒక్క గ్రామంలో కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పైపులైన్ల లీకేజీలను అరికట్టాలని, అవసరమైన చోట కొత్త బోర్లు లేదా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని సూచించారు. విద్యుత్ కోతలు లేకుండా చూడాలని, వ్యవసాయానికి మరియు గృహ అవసరాలకు నాణ్యమైన విద్యుత్తును అందించాలని విద్యుత్ శాఖ అధికారులకు స్పష్టం చేశారు. ఎక్కడైనా లూజ్ వైర్లు లేదా ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి సకాలంలో పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ లక్ష్యం ప్రజలకు మెరుగైన సేవలు అందించడమేనని, ఇందులో నిరక్ష్యం వహించవద్దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ మండల విద్యుత్‌శాఖ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులు మరియు ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

భార్గవి అంత్యక్రియలకు యువకుల ఆర్థిక సహాయం

చౌటకూరు, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: అనారోగ్యంతో అనంత లోకాలకు చేరిపోయిన కమ్మరి భార్గవి అంతక్రియలకు గ్రామ యువకులు ఆర్థిక సహాయం అందచేసి తామున్నామంటూ అండగా నిలిచిన సంఘటన మండల పరిధిలోని వెండికోలులో చోటుచేసుకుంది. వెండికోలు గ్రామానికి చెందిన నిరుపేద కమ్మరి మురళి తన భార్య భార్గవి, ఇద్దరు పిల్లలతో కలిసి పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లోని పరిశ్రమలో పని చేసుకుంటూ కుటుంబాన్ని సాకుతున్నాడు. భార్య భార్గవి అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స అందుకుంటూ గురువారం కానరానిలోకాలకు చేరిపోయింది. ముందే పేదరికం, ఆసుపత్రిలో ఖర్చులతో భార్య భార్గవి అంత్యక్రియలు చేసేదెలా అని తలపట్టుకున్న మురళికి గ్రామానికి చెందిన యువకులు 19వేల రూపాయలను విరాళంగా సేకరించి కమ్మరి మురళికి అందచేసి భార్గవికి కన్నీటి వీడ్కోలు పలికారు. మురళికి అండగా ఉన్న యువకులకు గ్రామస్థులు అభినందించారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందచేస్తున్న యువకులు

బొమ్మారెడ్డిగూడెంకు లైబ్రరీ మంజూరు చేయండి

-చైర్మన్ అంజయ్యకు సర్పంచ్ వినతి

చౌటకూరు, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: మండల పరిధిలోని బొమ్మారెడ్డిగూడెంకు లైబ్రరీ, రీడింగ్ రూంలను మంజూరు చేయాలని గ్రామ సర్పంచ్ జైపాల్ నాయక్ జిల్లా గ్రంథా లయ సంస్థ చైర్మన్ అంజయ్యకు వినతి పత్రం అందచేశారు. గ్రామంలో గ్రంథా లయంను ప్రారంభించి వార్త పత్రికలు, మ్యాగ్జిన్స్‌లు, పోటీ పరీక్షలకు హాజరయ్యే యువతకు గైడ్లు, చరంరిత్రను తెలియచేసే పాఠ్యపుస్తకాలను సమ కూర్చాలని వినతి చేశామని సర్పంచ్ జైపాల్ నాయక్ పేర్కొన్నారు. బొమ్మారెడ్డిగూడెంలో లైబ్రరీని ఏర్పాటు చేస్తే లక్ష్మీసాగర్‌కు పరిసరంగా ఉన్న 7 గిరిజన తండాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. గ్రంథాలయానికి అవసరమైన గదిని మంజూరు చేయాలని బాబులాల్, రాజు నాయక్‌లతో కలిసి చైర్మన్ అంజయ్యకు వివరించారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చర్మన్ అంజయ్యకు వినతి పత్రం అందచేస్తున్న సర్పంచ్ జైపాల్ నాయక్

అంగన్వాడీ టీచర్‌ను అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

నారాయణఖేడ్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త : కంగ్టి మండలం రాసోల్ గ్రామంలో అంగన్వాడీ టీచర్‌ను చెట్టుకు కట్టి అవమానపరిచిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ దిగ్గే బాబు డిమాండ్ చేశారు. గురువారం సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. ఖైసర్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 7న కంగ్టి మండలం రాసోల్ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు, టీచర్ భర్త హెచ్‌బిఎస్ ఫైనాన్స్ పేరిట డబ్బులు తీసుకొని మోసం చేశాడని ఆరోపిస్తూ, అంగన్వాడీ టీచర్‌ను చెట్టుకు తాడుతో కట్టి నిర్బంధించడం అత్యంత అమానుష చర్య అని పేర్కొన్నారు.ఈ వ్యవహారం ఇప్పటికే కోర్టులో విచారణలో ఉన్నప్పటికీ, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఒక మహిళను ప్రజల మధ్య అవమానపరచడం తీవ్రంగా ఖండించదగ్గదని అన్నారు. ఇలాంటి చర్యలు మహిళల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఘటనలో పాల్గొన్న వారిపై వెంటనే చట్టరీత్య చర్యలు తీసుకుని, బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ పూర్తిగా అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

మాట్లాడుతున్న డాక్టర్ దిగ్గే బాబు.

ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా రెడ్ రన్

మెదక్, ఏప్రిల్ 9,ప్రభాతవార్త : మెదక్ 99 రోజుల ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య వారోత్సవాల కింద నాలుగో రోజు ఎయిడ్స్ పై అవగాహన, నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం రెడ్ రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ సునీత, డి సి హెచ్ ఎస్ శివ దయాల్, నర్సింగ్ కాలేజ్ బాలికలు హాజరై ఈ రెడ్ రన్ వాకథాన్ ర్యాలీని జెండా ఊపి కలెక్టర్ ప్రారంభించారు.

ఈ నేపథ్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుండి రామ్‌దాస్ చౌరస్తా వరకు వరకు ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పిస్తూ ఈ రెడ్ రన్ వాకథాన్ ర్యాలీని చేపట్టారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎయిడ్స్ హెచ్ఐవి వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఎయిడ్స్ ఒక నివారించలేని ఇన్సు రేబుల్ వ్యాధి అయినప్పటికీ, సరైన జాగ్రత్తలు తీసుకుంటే దీనిని అరికట్టవచ్చని తెలిపారు.అసురక్షి త లైంగిక సంబంధాలు, సంక్రమిత రక్తం, వాడిన సిరంజీల ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుందని వివరించారు. అందువల్ల ప్రతి ఒక్కరూ సురక్షి త పద్ధతులను పాటిస్తూ, జాగ్రత్తగా ఉండాలన్నారు.

జిల్లాలో కూడా (385) హెచ్.ఐవి ఎయిడ్స్ కేసులు బాధితులకు జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వఆస్పత్రిలో గల ఏఆర్టీ కేంద్రంలో అవసరమైన చికిత్స అందిస్తున్నామన్నారు. ఈ మేరకు బాధితులు భయపడకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందాలని సూచించారు.

రాందాస్ చౌరస్తాలో ఎయిడ్స్ నివారణపై అదనపు కలెక్టర్ నగేష్ సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ ఎటువంటి భయాందోళనకు గురికాకుండా హెచ్ఐవి పరీక్షలు నిర్వహించు కోవాలని పాజిటివ్ అని నిర్ధారణ అయితే తగు జాగ్రత్తలు తీసుకుం టూ హెచ్ఐవి వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పల్లెల్లో, పట్టణాల్లో ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించేందుకు కళాజాతలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రజలు ఈ కార్యక్రమాలలో పాల్గొని, వ్యాధి గురించి సరైన సమాచారం తెలుసుకోవాలని కోరారు.

ర్యాలీలో వైద్య అధికారులు, ఆశాలు, సిబ్బంది, వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని, చేతిలో ప్లకార్డులు పట్టుకొని "ఎయిడ్స్ నివారణ" నినాదాలతో ప్రజలకు సందేశం అందించారు.ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీరామ్, ఇతర సంబంధిత వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశాలు, వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఎన్జీఓలు, తదితరులు పాల్గొన్నారు.

రెడ్ రన్ వాకథన్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

దళిత యువకుడికి మూడు బ్యాంకుల్లో కొలువులు

-యూ ట్యూబ్, ఆన్‌లైన్ ద్వార పోటీ పరీక్షలకు సిద్ధం
-టీజీబీ, ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడాలో ఉద్యోగాలు
-తెలంగాణ గ్రామీణ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజరర్‌గా దయాసాగర్

చౌటకూరు, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: నిరుపేద దళిత యువకుడు ఒకే మారు మూడు బ్యాంకుల్లో కొలువులు దక్కించుకుని అందరిచే ఔరా అనిపించుకుంటున్నాడు. లక్షలు వెచ్చించి కోచింగ్‌లు తీసుకుని పరీక్షలు పోటీ పరీక్షలు రాసినా ఉద్యోగుల రాని ఈ రోజుల్లో కోచింగ్ తీసుకునే ఆర్థిక స్థోమత లేక య ట్యూబ్, ఆన్‌లైన్ ద్వార పోటీ పరీక్షలకు సిద్ధమై పరీక్షలు రాసిన తొలి ప్రయత్నంలోనే తెలంగాణ గ్రామీణ బ్యాంక్, ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడాల్లో ఉద్యోగాలు దక్కించుకున్న యువకుడు అందరికి ఆదర్శంగా ఉంటాడని చెప్పడం అతిశయోక్తి కాదు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే... సంగారెడ్డి జిల్లా చౌటకూరు మండల పరిధిలోని హున్నాపూరర్ గ్రామానికి చెందిన నిరుపేద దళిత యువకుడు నీరుడి దయసాగర్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా, ఎస్‌బీఐలో జూనియర్ అసోసియేట్‌గా, బ్యాంక్ ఆఫ్ బరోడాలో క్లర్క్‌గా ఉద్యోగాలు చేసేందుకు గత ఏడాది డిసెంబర్ మాసంలో బ్యాంక్ ఉద్యోగాలకు నిర్వహించిన ప్రిలీమ్స్, మేయిన్స్ పరీక్షలు రాసి

మూడు బ్యాంకుల్లో ఉద్యోగుల సాధించిన దళిత యువకుడు దయాసాగర్

ఉత్తీర్ణత సాధించారు. దయాసాగర్ తన 8 ఏండ్ల వయసులోనే తండ్రిని కోల్పోవడంతో తల్లి ఆలనా పాలన చూసింది. సోదరుడి చేయుతతో పట్టుదలతో ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసి బ్యాంకుల్లో కొలువు చేయాలన్న లక్ష్యంతో బీటెక్ పూర్తవడంతో తన చేతిలోని స్మార్ట్ ఫోన్‌లో గేమ్‌లు ఆడుతూ రీల్స్ చేస్తూ, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లంటూ సమయాన్ని వృధా చేసుకోకుండా పోటీ పరీక్షలకు (యూ ట్యూబ్, ఆన్‌లైన్‌లో) క్లాసులు చూస్తూ, వింటూ ప్రిలీమ్స్, మేయిన్స్ పోటీ పరీక్షలకు హాజరై ఏకంగా టీజీబీ, ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడాలో ఉద్యోగాలు సాధించు కున్నాడు. గ్రామీణ ప్రజలకు సేవ చేయాలన్న ఉద్దేశంతో తెలంగాణ గ్రామీణ బ్యాంకులో అసిస్టెంట మేనేజర్‌గా విధుల్లో చేరేందుకు నిర్ణయించుకున్నట్లు, బ్యాంక్ నుంచి పిలుపు వచ్చిన వెంటనే ఉద్యోగంలో చేరి ప్రజా సేవచేస్తానని దయాసాగర్ పేర్కొన్నాడు. ఉద్యోగాలు సాధించుకునేందుకు పేదరికం అడ్డంకి కాదని, క్రమ శిక్షణతో ఏ పని చేసినా ఫలితం దక్కుతుందని దయాసాగర్ సూచిస్తున్నాడు.



ఎమ్మెల్యే రోహిత్‌రావు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం
రామాయంపేట బస్ స్టేషన్ అభివృద్ధికి కదిలిన ప్రజాప్రతినిధులు...

మెదక్ రోడ్డుపై ఎక్స్‌ప్రెస్ బస్ హాల్ట్‌కు డిమాండ్

ఎక్స్‌ప్రెస్ బస్ స్టాప్‌ల ఏర్పాటుకు ఎమ్మెల్యేకు వినతిపత్రం

రామాయంపేట, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : రామాయంపేట పట్ట ణంలో బస్ సౌకర్యాల మెరుగుదలకు ప్రజాప్రతినిధులు ముందడుగు వేశారు. రామాయంపేట బస్ స్టేషన్ అభివృద్ధి చేయడంతో పాటు 1వ వార్డు, 4వ వార్డులోని తాసిల్దార్ కార్యాలయం వద్ద రిక్వెస్ట్ బస్ స్టాప్‌లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మెదక్ రోడ్డుపై ఎక్స్‌ప్రెస్ బస్‌స్టాప్ నిర్మాణం అవసరమని పేర్కొన్నారు.
ఈ మేరకు సంబంధిత ఆర్టిసి రీజినల్ మేనేజర్, మెదక్ డిపో మేనేజర్ సమక్షంలో గురువారం నాడు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుకు వినతిపత్రాన్ని సమర్పించారు. పట్టణ ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడేలా, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు, పట్టణ కౌన్సిలర్లు గుగులోత్ రవి నాయక్, దేవుని రంజిత్, పుట్టి సందీప్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బైరాం కుమార్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ చింతల యాదగిరి, డీసీసీ సెక్రటరీ పోచమ్మల గణేష్, యువ నాయకులు విరాట్, సందీప్ తదితరులు హాజరయ్యారు.

వరిలో కోతల వరకు జాగ్రత్తలు అవసరం

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : వరి పంటలో అధిక దిగుబడి సాధించాలంటే రైతులు చిరు పొట్ట దశ నుంచి కోతల వరకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారి నాగం కృష్ణ సూచించారు. గురువారం నాడు మండల పరిధిలోని ఆరేపల్లి గ్రామంలో వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా నాగం కృష్ణ మాట్లాడుతూ మండలంలో దాదాపు 9100 ఎకరాలలో ఈసారి వరి పంటను పండిస్తున్నారని తెలిపారు. చిరు పొట్ట దశలో పంటను నిరక్ష ్యం చేస్తే దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఈ దశలో నీటి నిర్వహణ అత్యంత కీలకమని, పొలంలో తగినంత నీరు ఉండేలా చూసుకోవాలని చెప్పారు. నీటి కొరత లేదా అధిక నీరు ఉండడం వల్ల గింజల నాణ్యత తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అలాగే ఈ సమయంలో ఎరువుల వినియోగం సరిగా ఉండాలని, ముఖ్యంగా పొటాష్ ఎరువులు సరైన మోతాదులో వేయడం వల్ల మొక్కలు బలంగా ఎదుగుతాయని తెలిపారు.పురుగుమందుల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, దోమలు, తెగుళ్లు కనిపించిన

వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కోతకు ముందు దశలో పంట పూర్తిగా పక్వానికి వచ్చిన తర్వాతనే కోతలు ప్రారంభించాలని తెలిపారు. తొందరపడి కోతలు వేయడం వల్ల పంట దిగుబడి తగ్గుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సుభాష్, రైతులు చిమ్మ సంగమేశ్వర్,

దాతల సహకారం భూదానంతో ఆశ్రమానికి శ్రీకారం

పావన్నపేట, ఏప్రిల్ 9, ప్రభాతవార్త : పావన్నపేట మండల పరిధిలోని యూసుఫ్‌పేట గ్రామంలో శ్రీశివరామ దీక్షి తుల భజన ఆశ్రమ నిర్మాణం కోసం అదే గ్రామానికి చెందిన ముగ్గురు దాతలు రెండు గుంటల భూమిని దానం చేసినట్లు భజన మండలి సభ్యులు డాక్టర్ అవుసుల నర్సింలు వెల్లడించారు . అదే గ్రామానికి చెందిన వడ్డేపల్లి జయరాం రెడ్డితో పాటు బైండ్ల నారాయణ, అదృష్ట సోదరులు భూదానం చేసినట్లు ఆయన తెలిపారు, కాగా ఆశ్రమ నిర్మా ణం కోసం అదే గ్రామానికి చెందిన డాకరెడ్డి ,మధుసూదన్ రెడ్డితో పాటు స్థానికులు ఆర్థిక సాయం అందజేశారని, ఇందుకు సహ కరించిన దాతలకు స్థానిక సర్పంచ్ అనిత నరేందర్ రెడ్డి , శివరామ దీక్షి తుల శిష్యులతో పాటు భజన మండలి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు .

దాతల సహాయంతో నిర్మాణంలో ఉన్న భజనమండలి షెడ్

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు మల్లేశ్

సామాజిక న్యాయ సాధన జయప్రదం చేయండి

-సిఐటియు జిల్లా అధ్యక్షులు మల్లేశ్

పుల్‌కల్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త: మండల పరిధిలోని శివంపేటలోని సిబిఎల్‌లో గురువారం నిర్వహించిన సామాజిక న్యాయ సాధన క్యాంపెయన్‌కు సిఐటియు జిల్లా అధ్యక్షులు బి మల్లేశ్ ముఖ్య అతిథిగా హాజరయి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ కులం, మతం, లింగబేధం లాంటి సామాజిక అంశాలు మన భారత దేశంలో ప్రజలను కార్మిక వర్గాన్ని ఐక్యం కానివ్వకుండా ఆటంకంగా ఉన్నాయన్నారు. కార్మిక వర్గంలో సున్నితమైన అంశాలను దోపిడి వర్గాల ప్రయోజనాల కోసం పాలవ వర్గాలు ముందుకు తెస్తూ కార్మిక వర్గం ఐక్యతను విచ్ఛిన్నం చేసి దోపిడి వర్గాలు తమ ప్రయోజనాలను కాపాడుకుంటున్నారన్నారు. ఏప్రిల్ 6 సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షులు కామ్రేడ్ బిటి రణదీవి వర్ధంతి నుంచి ఏప్రిల్ 15 వరకు తెలంగాణ రాష్ట్రంలో సామాజిక న్యాయ సాధన క్యాంపెన్‌ను నిర్వహిస్తోందన్నారు. క్యాంపెయిన్‌లో సిఐటియు అనుబంధ సంఘాలన్నీ భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. క్యాంపెయిన్‌ను పురస్కరించుకుని సామాజిక ఉద్యమ నిధిని కార్మికుల నుంచి సేకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిఐటియు వర్కింగ్ ప్రెసిడెంట్ పి బాగారెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రసన్న, నాయకులు నాగభూషణం, చంద్రయ్య, విఠల్, లక్ష్మారెడ్డి, కాంటాక్ట్ లేబర్ ప్రధాన కార్యదర్శి కే సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు కూడా ఆర్థికంగా ఎదగాలి

సదాశివపేట,ఏప్రిల్ 9 (ప్రభాతవార్త): మహిళలు కూడా ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం గానీ స్వచ్ఛంద సంస్థలు కానీ వారికి తగినట్లుగా పనులలో శిక్షణ ఇస్తుందని గ్రామ స్వరాజ్య సంస్థ జిల్లా ఇన్చార్జి అంగడిపేట శ్రీదేవి అన్నారు. గ్రామంలోని 45 మంది మహిళలకు కుట్టు మిషన్ లలో 30 రోజులపాటు శిక్షణ ఇవ్వడం జరిగిందని, నేర్చుకున్న వారికి సర్టిఫికెట్ తో పాటు సబ్సిడీపై కుట్టు మిషన్లు అందజేయడం జరుగుతుందని వారు తెలిపారు. టైలరింగ్ ద్వారా మహిళలు తమ స్వశక్తితో సంపాదించి ఆర్థికంగా ఎదగాలని మహిళలను ఉద్దేశించి ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తులసి సత్యనారాయణ, ఉపసర్పంచ్ బుచ్చి రాములు వార్డు మెంబర్లు పంచాయతీ సెక్రెటరీ ప్రదీప్ కుమార్, గ్రామ పెద్దలు,ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ కవిత పాల్గొన్నారు.

మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

ఖజాపూర్‌లో సందడి చేసిన బలగం వేణు

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 9,ప్రభాతవార్త: చిన్న శంకరంపేట మండలం ఖజాపూర్‌లో బలగం వేణు గురువారం సందడి చేశారు. ఏల్లమ్మ సినిమా చిత్రీకరణలో భాగంగా గ్రామంలో పర్యటించినట్లు వేణు తెలిపారు. గ్రామం షూటింగ్‌కు అనుకూలంగా ఉంటే ఏల్లమ్మ సినిమాలోని కొన్ని సన్నివేశాలను చిత్రికరిస్తామని వేణు తెలిపారు. బలగం సినిమాతో డైరక్టర్‌గా తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నాడు వేణు. వేణు పర్యటనతో గ్రామంలో సందడి నెలకొంది.

బలగం వేణుతో సర్పంచ్ బాలస్వామి